నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం | జూన్ 27, 2024 | www.navatelangana.com

మత్స్యకారుడి వలకు భారీ చేప



మత్స్యకారుడికి చిక్కిన 25 కిలోల భారీ చేప

నవతెలంగాణ-బాల్కొండ

శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వద్ద ఓ మత్స్యకారుడి వలకు భారీ చేప చిక్కింది. బుధవారం మండల పరిధిలోని జలాల్‌పూర్ ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో చేపల వేటకు వెళ్లిన మండల కేంద్రానికి చెందిన బట్టు బలరామ్‌కు ఏకంగా 25 కిలోల భారీ చేప చిక్కింది. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో నీరు తక్కువగా ఉండడంతో భారీ చేపల లభ్యతపై మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు. భారీ చేప చిక్కడంతో అక్కడున్న జాలర్లు ఫోటోలు సెల్ఫీలు తీసుకున్నారు. 25 కిలోల బొచ్చే రకం చేపకు మార్కెట్లో కిలో రూ.135 చొప్పున దీని ధర రూ.3375 పలుకుతుందని మత్స్యకారుడు సంతోషం వ్యక్తం చేశాడు.

కామ్రేడ్ డీవీకే ఆశయాలు కొనసాగిద్దాం

- ప్రదీప్ సింగ్ ఠాగూర్
- సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ ఆలిండియా కార్యదర్శి
- డీవీ కృష్ణ స్మారక స్థూపావిష్కరణ



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

విప్లవోద్యమ నాయకుడు, ఆదర్శ కమ్యూనిస్టు, ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ డీవీ కృష్ణ స్మారక స్థూపావిష్కరణ, వర్ధంతి సభ సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రేడియో స్టేషన్ ఎదురుగా డీవీకే నగర్‌లో బుధవారం నిర్వహించారు. ముందుగా రేడియో స్టేషన్ నుండి సభాస్థలి వరకు భారీర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ జెండా ఆవిష్కరణ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆలిండియా కార్యదర్శి కామ్రేడ్ ప్రదీప్ సింగ్ ఠాగూర్ డీవీ కృష్ణ స్మారక స్థూపాన్ని ఆవిష్కరణ చేశారు.

వివరాలు మెయిన్‌లో..



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే

విద్యారంగానికి అధిక ప్రాధాన్యత

- ఎమ్మెల్యే తోట లక్ష్మికాంత్‌రావు

నవతెలంగాణ-నిజాంసాగర్

కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. ఆయన మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఏకరూప దుస్తులు, పుస్తకాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటుందని. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు,మధ్యాహ్న భోజన సౌకర్యాలు కల్పిస్తుందని ఆయన అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని, చదువుతోపాటు ఆటపాటల్లో కూడా రాణించాలని ఆయన తెలిపారు. మార్కులు సాధించడమే లక్ష్యంగా చదువులు కొనసాగించకుండా వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యత పెంపొందించుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు అన్ని రంగాలలో పోటీపడే విధంగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి దేవి సింగ్, ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లికార్జున్, రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జయ ప్రదీప్, ప్రజా పండరి, పాఠశాల ప్రిన్సిపాల్ సరోజ, ఉపాధ్యాయ బృందం, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడికి 'ఎండదెబ్బ'

- వర్షాలు లేక ఎండుతున్న ఆరుతడి పంటలు
- మొలక దశలో వాడిపోతున్న వైనం
- వర్షం కోసం రైతుల ఎదురుచూపులు



నవతెలంగాణ-లింగంపేట్

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో చిన్న, సన్న కారు రైతులు తొలకరి చిలుకలు కురవగానే సంతోషంతో ఆరుతడి పంటలు వేశారు. పంటలు వేసిన నాటి నుండి వర్షాలు సక్రమంగా కురువకపోవడంతో ఆదిలోనే పంట ఎడుముఖం పడుతోంది. మొలకలు వాడిపోతుండటంతో రైతులు దిగులు చెందుతున్నారు. భారీ వర్షాలు కురవకపోవడంతో పంటలకు నీటి తడులు అందక ఎండుముఖం పడుతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో ఆరుతడి పంటలు ఎండుముఖం పడుతున్నాయి. వర్షాకాలం సీజన్ ప్రారంభమైన భానుడు తన ప్రభావం చూపుతున్నాడు. సగటు 36 నుంచి 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఒక వైపు వర్షాల లేమి, మరో వైపు ఎండలు మండుతుండటంతో పంటలు వాడిపోతున్నాయి.

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో వరుణుడు కనుకరించకపోవడంతో అన్నదాతలు వర్షం కోసం రోజుల తరబడి ఎదురుచూస్తున్నారు. వేల రూపాయల పెట్టుబడులు పెట్టి అప్పులు చేసి ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసి దుక్కులు దున్ని తొలకరి జల్లులకు రైతులు ఆరుతడి పంటలైన మొక్కజొన్న పత్తి సోయా పెసర మినుము కంది తో పాటు తదితర విత్తనాలను వేశారు. విత్తనాలు మొలక దశకు రాగా.. వర్షాలు లేక వాడిపోతున్నాయి. నిత్యం ఆకాశం మేఘావృతం అవుతున్న వర్షాలు కురవకపోవడంతో మొలకెత్తిన మొలకలు ఎండ దెబ్బతో వాడిపోతున్నాయి.

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 5 లక్షల 14 వేల ఎకరాలలో వివిధ రకాల పంటలు సాగు అవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు ఖరీఫ్ ప్రణాళికను సిద్ధం చేశారు. ఇందులో ముఖ్యంగా వరి పంట అత్యధికంగా 3 మూడు లక్షల 18 వేల 965 ఎకరాలలో సాగు చేయనున్నారు.

అదేవిధంగా ఆర్తడి పంటలైన మొక్కజొన్న 57,315 ఎకరాలు, సోయాబీన్ 85,444 ఎకరాలు, పత్తి 28,730 ఎకరాలు, కందులు 14,961, పెసర్లు 4,997, మినుములు 5,263, జొన్న 577 ఎకరాలతో పాటు ఇతర పంటలు సాగు చేస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించి తొలకరి జల్లులు కురియడంతో రైతులు ఆరుతడి పంటలు వేశారు. అయితే అప్పటినుండి ఇప్పటివరకు అప్పుడప్పుడు చిరుజల్లులు కురిసినా భారీవర్షం కురిసిన దాఖలాలు లేవు. దీంతో వేసిన పంటలు వాడిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

7 ఎకరాలు ఎండిపోతుంది



ఏడు ఎకరాలలో సోయా పత్తి మొక్కజొన్న పంట వేసిన. అప్పటినుంచి ఇప్పటివరకు వాన రాకపోవ డంతో 7 ఎకరాలు ఎండిపోతుంది. వర్షం పైనే ఆధారపడి పంట వేస్తే వర్షం కురవడం లేదు. మరో వారం రోజులు ఇదే దుస్థితి ఉంటే వేలాది రూపాయల నష్టం వాటిల్లుతుంది.

అశోక్ రావు. మోతే, రైతు.

వాన కోసం ఎదురు చూస్తున్నాం

మూడు ఎకరాల్లో మక్కేసిన. మొత్తం ఎండిపోతుంది. వాన కోసం ఎదురుచూస్తున్నాం. వాన పడకపోతే ఉన్నది ఎండిపోతది. 20 రోజుల నుంచి వర్షాలే లేవు. వర్షాకాలంలో కూడా ఎండలు మండుతున్నాయి.

పరశురాం. మంబోజి పేట తాండ

చినుకు జాడ లేదు..

సాగునీటి సౌకర్యం లేని ప్రాంతాల్లో ఎక్కువ మంది రైతులు ఆరుతడి పంటల సాగుకు మొగ్గు చూపారు. మొక్కజొన్నతో పాటు పెసర, మినుము, పత్తి, కందులు, సోయా పంటలు వేశారు. జిల్లాలోని గాంధారి, సదాశివనగర్, తాడ్వాయి, రాజంపేట, జుక్కల్, మద్నూర్, పిట్లం, పెద్ద కొడప్‌గల్ మండలాల్లో రైతులు ఆరుతడి పంటలు ఎక్కువ సాగు చేశారు. అయితే ఆయా ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడంతో ఎండవేడికి మొలకలు వాడిపోతున్నాయి. ఇప్పటివరకు సుమారు 50 వేల ఎకరాలపైగా పత్తి సోయా మొక్కజొన్న పెసర మినుము కందులు మొలకెత్తిన మొక్కలు వాడిపోయినట్టు సమాచారం.

విత్తనాలు మొలకెత్తిన నాటి నుంచి వరుణుడు కరుణించకపోవడంతో వాడిపోతున్నాయి. మరికొన్ని విత్తనాలు వేడి ప్రభావానికి మొలకెత్తకుండానే దుక్కిలో కుళ్ళిపోతున్నాయి. మళ్లీ విత్తనాలు వేసినా నీటి సౌకర్యం లేకపోవడంతో రైతులు వర్షం పైనే ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. రైతులు పెట్టుబడులు పెట్టిన అదనపు పెట్టుబడి భారం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజు ఆకాశం మేఘావృతం అవుతున్న వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ శాఖ అధికారులు భారీ వర్షాలు ఉన్నాయని సూచనలు చేసిన ఇప్పటివరకు జిల్లాలో 20 రోజులుగా అక్కడక్కడ చిరుజల్లులు కురిసిన ఆరుతడి పంటలు సాగు చేసే ప్రాంతాల్లో చిరుజల్లులు కురవకపోవడంతో ఆరుతడి పంటలు పూర్తిగా వాడిపోతున్నాయి.

లింగంపేట మండలంలోని మోతే గ్రామంలో ఖరీఫ్ సీజన్లో 700 ఎకరాల్లో పత్తి, 400 ఎకరాలు మొక్కజొన్న, 350 ఎకరాలు సోయా, 500 ఎకరాలు పెసర మినుము పంటలు సాగు చేస్తున్నారు. తొలకరి సమయంలో విత్తనాలు వేయడంతో మొలకెత్తగా.. ఇప్పటివరకు వర్షాలు కురువకపోవడంతో వాడిపోతున్నాయి. జిల్లావ్యాప్తంగా ఇదే దుస్థితి నెలకొంది. వర్షం కోసం ఆకాశానికి ఎదురుచూస్తున్నారు.

రైలుకింద పడి నరకయాతన

- చేతు, కాలు పోగొట్టుకున్న వ్యక్తి





గాయలైన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అసలే రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబం. కుటుంబ పోషణకు రైలులో తినుబండారాలు విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో ఒక బోగి లో నుంచి మరో బోగిలోకి వెళ్తున్న క్రమంలో రైలు కదలడంతో ప్రమాదవశాత్తు రైలు కింద పడ్డాడు. ఒక చేతు, ఒక కాలు మీద నుంచి రైలు కదలడంతో వాటిని కోల్పోయాడు. వివరాల్లోకి వెళ్తే.. డిచ్‌పల్లి మండల కేంద్రానికి చెందిన విష్ణు (55) రైళ్లల్లో తిబండరాలు అమ్ముకొని కుటుంబం, జీవనం కొనసాగిస్తున్నాడు. బుదవారం డిచ్ పల్లి రైల్వేస్టేషన్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆగింది. ఒక్కొక్క డబ్బాలో ఎక్కి తినుబండారాలు అమ్ముకుని కదులుతున్న సమయంలో ప్లాటుఫారం రైలు బోగి మధ్య కాలు జారీ ప్రమాద వశాత్తు పడ్డాడు. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది సురేష్ ,కిషన్ అక్కడికి చేరుకుని రైళ్ల చక్రల వద్ద పడిన వ్యక్తిని సకాలంలో బయటకు తీసి ప్రాణాలు కాపాడారు. ఎడమ కాలు, చేతు మొత్తం ఊడిపోయింది. వెంటనే ప్రథమ చికిత్స అందజేసి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్టు నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ సాయిరెడ్డి తెలిపారు.

భూ పరీక్షల పైలెట్ ప్రాజెక్టుగా రామారెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

కామారెడ్డి జిల్లా భూ పరీక్షలకు పైలెట్ ప్రాజెక్టుగా రామారెడ్డి మండలాన్ని ఎంపిక చేయడం హర్షించదగ్గ విషయమని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 2000 భూసార పరీక్షలు నిర్వహించనున్నందున రైతులు ఈ అవకాశాన్ని వినియోగించు కొని ,పంట మార్పిడి చేసుకొని అధిక దిగుబడులు సాధించి రాష్ట్రానికి అదర్శనంగా నిలువలని సూచించారు. రామారెడ్డి మండలాన్ని ఎంపిక చేసినందుకు వ్యవసాయ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

మత్తుతో భవిష్యత్తు చిత్తు

- మాదక ద్రవ్యాలు, మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగంతో భవిష్యత్తు చిత్తు అవుతుందని పలువురు పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం పాత కలెక్టరేట్ మైదానం నుంచి జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ మీటింగు హాలు వరకు అవగాహన ర్యాలీని నిర్వహించి జిల్లా న్యాయ సేవ సంస్థ మీటింగు హాలు నందు జిల్లా స్థాయి కార్యాక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవ సంస్థ చైర్మన్ సునితా కుంచాల, సెక్రెటరీ జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ మరియు సీనియర్ సివిల్ జడ్జ్ పద్మావతి విచ్చేసి మాట్లాడారు.

డ్రగ్స్ దుర్వినియోగంపై ఎస్.ఎస్.ప్రసాద్ రూపొందించిన లఘు చిత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం గోడప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రొబేషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరవేక్షకులు కే. మల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు డా. ప్రతిమారాజ్, ఇండియన్ సైకియార్టిక్ సొసైటీ తెలంగాణా బ్రాంచ్ జనరల్ సెక్రెటరీ, ప్రొఫెసర్ డా. విశాల్ ఆకుల , జిలా సంక్షేమ అధికారిణి ఎస్.కే. రసూల్ బీ, జిల్లా యువజన అభివృద్ధి అధికారిణి బి. శైలీ తదితరులు పాల్గొన్నారు.

ఏంతిని బతకాలి..?

- 8 నెలల నుంచి జీతాలు లేక అల్లాడుతున్న పంచాయతీ సిబ్బంది
- అరెస్టులపై ఉన్న దృష్టి సమస్యల పరిష్కారంపై ఎందుకు లేదు..?
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ ప్రశ్న
- పాలకులు మారినా సమస్యలు తీరడం లేదని విమర్శ



ధార్నా చేస్తున్న జీపీ కార్మికులు, నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కామారెడ్డి

గ్రామపంచాయతీ సిబ్బందికి 8 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, ఇన్ని నెలలుగా వేతనాలు రాకపోతే వారి కుటుంబాన్ని ఎలా నెట్టుకొస్తారని ఏం తిని బతకాలని సీఐటీయూ నాయకులు ప్రశ్నించారు. గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిజామాబాద్‌లోని ధర్నా చౌక్‌లో పంచాయతీ కార్మికులు సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం డీఎల్‌పీవోకు వినతిపత్రం అందజేశారు. కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్‌గౌడ్, సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జీపీ కార్మికులు బైటాయించారు.

ఈ సందర్భంగా నిజామాబాద్‌లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, యూనియన్ జిల్లా కార్యదర్శి జంగం గంగాధర్ మాట్లాడారు. కామారెడ్డిలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్ గౌడ్, సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ మాట్లాడారు.

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అయినప్పటికీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని, ఎనిమిది నెలల వేతనాలు పెండింగ్, మల్టీపర్పస్ రద్దు సమస్యలపై ప్రభుత్వ అలసత్వం సరైంది కాదని అన్నారు. పాలకులు మారినా కార్మికులు సమస్యలు పరిష్కారం కావడం లేదని అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామి అమలు చేయడం లేదని అన్నారు. ఎనిమిది నెలలుగా వేతనాలు పెండింగ్ లో ఉంటే కార్మికులు ఏమి తిని ఎట్లా బతకాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

కార్మికుల జీవితాలకు భద్రత లేదని, మల్టి పర్పస్ విధానం వచ్చిన తర్వాత కార్మికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని అన్నారు. చేతులు, కాళ్లు తెగిపోతున్నా శరీరం అస్తవ్యస్తమైనా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి పెట్టాలని లేని యెడల పోరాలను ఉదతం చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వంలో ఉన్న పెద్దలకు, అధికారులకు నెలనెల వేతనాలు తీసుకుంటున్నప్పుడు, క్షేత్ర స్థాయిలో ప్రజల ఆరోగ్యాలను కాపాడుతూ,కంటికి రెప్పలా గ్రామాలను, మండల కేంద్రాలను శుభ్రం చేసి అద్దం లా మెరిసేటట్లు చేస్తున్న అతి పేదలుగా ఉన్న కార్మికులకు మాత్రం నెల నెల వేతనాలు ఇవ్వడం లేదన్నారు. గత ప్రభుత్వం లో కార్మికుల పట్ల ఏ రకంగా వ్యవహరించారో ఈ ప్రభుత్వ నడక కూడా అలాగే ఉన్నదని అన్నారు. రాబోయే రోజుల్లో సమస్యల పరిష్కారం కోసం మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలునిచ్చారు.

నిజామాబాద్‌లో ధర్నా సందర్భంగా సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిపిఓ కార్యాలయం నుండి వచ్చిన డిఎల్‌పిఓ శ్రీనివాస్‌కు అందజేసి సమస్యల తీవ్ర తను తెలియజేయగా, కొద్ది సమయం తీసుకొని సమస్యల పరిష్కారంపై కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వేతనాలలో ఉన్న తేడాలు ఏయే గ్రామ పంచాయతీలలో ఉన్నాయో వాటిని సరి చేస్తామని హామీ ఇచ్చారు. పెండింగ్ లో ఉన్న వేతనాలు విడుదలకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించేందుకు ప్రయత్నం చేస్తామని, ఐడెంటి కార్డులు ఫొటోస్ ఇవ్వండి వెంటనే ఇస్తామని తెలి పారు. ఆదివారాలు,పండుగ సెలవులు అమలు కోసం, ఇతర సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని డిపిఓ దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజేష్, యూనియన్ జిల్లా కోశాధికారి సాగర్, యూనియన్ జిల్లా ఉపా ధ్యక్షులు పద్మ, గంగారాం, మెనూ కుమార్ రంజిత్, జబీన్ లక్ష్మి సాయిలు మల్లేష్, పాల్గొన్నారు.

కామారెడ్డిలో జిల్లా నాయకులు రాజన్న, శ్యాం, స్వామి, బాలనర్సు, మల్లేష్, రవి, రాజారాం, సాయిలు, శంకర్, గ్రామపంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రాన్ని అందజేస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్



కామారెడ్డిలో కలెక్టరేట్ ఎదుట బైటాయించి నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు, సిబ్బంది

ఎక్కడి వారు అక్కడే గప్ చుప్

- నవతెలంగాణ కథనం ఎఫెక్ట్
- అక్రమ మైనింగ్‌పై విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న అధికారి

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

బాన్సువాడ మండలంలో నిర్వహిస్తున్న అక్రమ మొరం రవాణా వ్యవహారాలపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మైనింగ్ అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. బుధవారం 'గుట్టలను తవ్వేస్తున్న మొరం మాఫియా' అన్న శీర్షికతో నవతెలంగాణ దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్ప ందించిన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా మైన్స్ శాఖ అధికారిణి, రెవెన్యూ అధికారి కలసి విచారణ చేపట్టారు. పత్రికల్లో వార్త రావడంతో తనిఖీలు నిర్వహించినట్లు బాన్సువాడ తహసీల్దార్ వరప్రసాద్ తెలిపారు.

అనుమతులు లేకుండా మైనింగ్ నిర్వహిస్తే, చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని బాన్సువాడ తహసిల్దార్ వరప్రసాద్ హెచ్చరించారు. నవతెలంగాణ వార్తాపత్రికలో అక్రమ మొరంపై వార్త ప్రచురితం కావడంతో, పాటు పేపర్ కటింగ్ వాట్సప్ గ్రూపుల్లో షేర్ కావడంతో అప్రమత్తమైన కొందరు.. అలాగే అధికారుల అండదండలు ఉన్న మరో గ్రూప్ వారు నేడు బుడిమి, కొత్తబాది, సింగీతం శివారులో మధ్యాహ్నం వరకు జోరుగా అక్రమ మొరం రవాణా సాగించారు. మైనింగ్ అధికారులు వస్తున్నారని సమాచారం స్థానిక రెవెన్యూ అధికారులు కొందరు మొరం మాఫియాకు ఇవ్వడంతో అప్రమత్తమైన మొరం మాఫియా.. ఎక్కడి వాహనాలు అక్కడ కొద్దిసేపు నిలిపివేశారు. మైన్స్ , రెవెన్యూ అధికారులు విచారణకు వెళ్లినప్పుడు అక్కడ వాహనాలు లేకపోవడంతో అధికారులు వెను తిరిగారు. మొరం మాఫియాకు రెవెన్యూ శాఖలో కొందరు అధికారులు సంపూర్ణ మద్దతు ఇవ్వడంతోనే బాన్సువాడ మండలంలో అక్రమ మొరం రవాణా సాగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమంగా మొరం తరలిస్తున్నట్లు ఆరోపణలు నేపథ్యంలో అధికారులు వారి వంక చూడడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మొరం మాఫియా చేస్తున్న అక్రమ మైనింగ్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇరుకుగా ప్రధాన రహదారి


ఇరుకుగా మారిన ప్రధాన రహదారి

నవతెలంగాణ-పోతంగల్
మండల కేంద్రంలో బస్‌స్టాండ్ నుంచి పాత పోతంగల్, మండల ఆఫీస్, గ్రామ పంచాయతీలకు వెళ్లే ప్రధాన రహదారి ఇరుకుగా మారింది. రహదారికి ఇరుపక్కల షాపులు, వాహనాల పార్కింగ్, దీనికితోడు ఇరుకైన వంతెన ఉంది. దీంతో ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. ఎన్నో ఏండ్లుగా ఉన్న ఈ ఇబ్బందిని దూరం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పసుపు మొక్కల పంపిణీ


పసుపు మొక్కలు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్త

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండల కేంద్రంలోని పసుపు పరిశోధన కేంద్రంలో బుధవారం రైతులకు పసుపు మొక్కలను పంపిణీ చేశారు. పసుపు పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మహేందర్ ఆధ్వర్యంలో పసుపు మొక్కలు రైతులకు అందజేశారు. పరిశోధన కేంద్రంలో అభివృద్ధి చేసిన ఆర్మూర్ రకం, మహేంద్ర సోనాలిక, పీతంబర్, రాజాపూరి, సేలం రకాలకు చెందిన పసుపు మొక్కలను ఒక రూపాయికి ఒక మొక్క చొప్పున ఒక్కో రైతుకు ఐదువేల నుండి పదివేల మొక్కలను అందజేసినట్లు శాస్త్రవేత్త మహేందర్ తెలిపారు.

ఎంపీ అరవింద్‌కు సన్మానం


ఎంపీని సన్మానిస్తున్న బిజెపి సీనియర్ నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్
మన రాష్ట్రం నుంచి గెలిచిన ఎంపీలు, కేంద్ర మంత్రులను బిజెపి సీనియర్ నాయకులు కోటపాటి నరసింహ నాయుడు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ ధర్మపురి అరవింద్‌ను కలిసి సన్మానించారు. వారికి అప్పగించిన బాధ్యతల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. కిషన్‌రెడ్డికి దేశ బొగ్గు గనుల బాధ్యతలు లభించడం అభినందనీయమన్నారు. ఫైర్ బ్రాండ్ ధర్మపురి అరవింద్‌కు మంత్రి పదవికి అన్ని విధాల అర్హతలు ఉన్నప్పటికీ ఈ టర్మ్‌లో వారికి అవకాశం రాకపోవడం నిరాశపరిచిందని అన్నారు. వారి నాయకత్వంలో త్వరలో " పసుపు బోర్డు" కార్యకలాపాలు నిజామాబాద్ కేంద్రంగా" అరవింద్" అధ్యక్షతన ప్రారంభం కావాలని కోరారు.

భూసార పరీక్షలతో లాభాల పంట

- మండల వ్యవసాయ అధికారి


మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి

నవతెలంగాణ-బాల్కొండ
మండల కేంద్రంలో భూసార పరీక్షలు చేయడానికి అవసరమైన మట్టి నమూనాల సేకరణ వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ప్రారంభించినట్టు బుధవారం మండల వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి నిజామాబాద్ జిల్లాలో బాల్కొండ మండలాన్ని భూసార పరీక్షల నిమిత్తం ఎంపిక చేసినట్టు తెలిపారు. బాల్కొండ మండలంలో సాగు అవుతున్న 10,600 ఎకరాలకు గాను ఐదు ఎకరాలకు ఒకటి చొప్పున 2120 మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడం జరిగిందన్నారు. ఈ వానాకాలం సీజన్‌కు 25శాతం మేర మట్టి నమూనాల సేకరణ ప్రారంభించామన్నారు. భూసార పరీక్ష ఫలితాల అనుసారం పోషకాల లభ్యతను బట్టి ఎరువుల పెట్టుబడి తగ్గించుకొని దిగుబడులను పెంచుకొని ఆదాయం పెంచుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణాధికారి రేష్మ, రైతులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటాం

- మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల దేవి లావణ్య


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల దేవి లావణ్య

నవతెలంగాణ-ఆర్మూర్
ప్లాస్టిక్ నియంత్రణపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల దేవి లావణ్య అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో తయారుచేసిన జ్యూట్ బ్యాగులను బుధవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. ప్రజలు ప్లాస్టిక్ కవర్లు వాడవద్దని వాటి స్థానంలో ఈ బట్ట సంచులను ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్, టీ ఎంసి ఉదయశ్రీ, మెప్మా ఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై చర్యలేవి?

- అధికారుల నిర్లక్ష్యం
- కాలనీవాసులకు కష్టాలు
- ఫిర్యాదు చేసి 20 రోజులైన పట్టించుకోని కార్యదర్శి



నవతెలంగాణ-ధర్పల్లి
మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయానికి సమీపంలోని కాలనీలో మురుగు కాలువలో దుర్గంధం వస్తుందని కాలనీ వాసులు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. పక్కనే ఉన్న మేకల వ్యాపారి తన మేకల వ్యర్థాలను మురుగు కాలువలో పడేయడంతో దుర్గంధం వస్తుందని కాలనీ వాసులు తెలిపారు. దీంతో దోమలు విపరీతంగా పేరిగిపోయాయని, వాటివల్ల వ్యాధులు వస్తాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 20 రోజుల క్రితం పంచాయతీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని, తమగోడు ఎవరికి చెప్పుకోవాలను వాపోయారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి డ్రైనేజి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

డ్రగ్స్‌రహిత సమాజానికి కృషిచేద్దాం


బాల్కొండ: మాట్లాడుతున్న ఎస్సై


ధర్పల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


నవీపేట్: మాట్లాడుతున్న ఎస్సై

- మాదకద్రవ్యాలకు బానిసలు కావద్దు
- విద్యార్థులతో ర్యాలీలు
- డ్రగ్స్‌వల్ల కలిగే పరిణామాలపై అవగాహన

నవతెలంగాణ-విలేకరులు
అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం పలుచోట్ల అధికారులు ర్యాలీలు నిర్వహించారు. డ్రగ్స్ వల్ల కలిగే పరిణామాలను వివరించారు.

బోధన్: డ్రగ్స్, మత్తు పదార్థాలను అలవాటు చేసుకుని బానిస కావద్దని, దీనివల్ల జీవితాలు దుర్భరంగా మారుతాయని, కావున వాటిని అరికట్టడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని బోధన్ ఎసిపి శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పట్టణ ప్రముఖులు, విద్యార్థులు, పోలీసు అధికారులతో ఆయన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. నేటి యువత దుర్వసనాలకు అలవాటు పడి డ్రగ్స్ మత్తు పదార్థాలకు నిషేధిత పదార్థాలను అలవాటు చేసుకుని వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఇది కరెక్ట్ కాదని అన్నారు. తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలను ఆడియాసలు చేయకుండా క్రమశిక్షణతో మెలగాలని ఉత్తమ పౌరులుగా మారాలని సూచించారు. మత్తు పదార్థాలు అయిన డ్రగ్స్, గంజాయి లాంటివి కలిగి ఉన్న సేవించిన చట్టరిత్యా శిక్షార్హులు అని అన్నారు. కావున ఎక్కడ కూడా మత్తు పదార్థాలు లేకుండా డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. అనంతరం వాటి వల్ల కలిగే దుష్పరిణామాలను విద్యార్థులకు యువతకు వివరించారు.కార్యక్రమంలో సిఐలు వీరయ్య, కోల నరేష్, ప్రైవేట్ విద్యాసంస్థల అధినేతలు శ్రీనివాసరావు, చక్రవర్తి ,ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు జావిద్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ : డ్రగ్స్ రహిత సమాజాన్ని భావితరాలకు అందించాలని ఎస్ఐ జి. రమేష్ అన్నారు. డ్రగ్స్‌ని తరిమికొడుతూ యువతను కాపాడుకోవాలని మండల కేంద్రంలో పోలీస్‌లు ర్యాలీ నిర్వహించారు. గంజాయి, ఆల్కహాల్, గుట్కాలపైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆదర్శ పాఠశాల విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

ముప్కాల్: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8,9,10వ తరగతి విద్యార్థులకు మత్తు పదార్థాలు (గంజాయి, గుట్కా, ఆల్కహాల్)పై ఎస్ఐ భాస్కరా చారి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు మత్తు పదార్థాలపై వ్యాసరచన పోటీలు చేపట్టారు. బస్టాండ్ నుంచి బైపాస్ రోడ్డు వరకు ర్యాలీ సైతం నిర్వహించారు. వ్యాసరచన పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు 'మత్తుపదార్థాల రచన పుస్తకాల'ను అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్సై గంగారాం, ప్రధానోపాధ్యాయులు గంగారాం, గుండోజి నరేందర్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోర్తాడ్: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎస్సై అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా ప్రభుత్వ కళాశాల నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహిస్తూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దంటూ నినాదాలు చేశారు. సేవా కార్యక్రమాలకు యువత ముందుకు రావాలని ఎస్ఐ అనిల్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. మాదక దవ్యాలకు అలవాటు పడిన వారి వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్లో సమస్యలు ఇవ్వాలని అన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నవీపేట్: డ్రగ్స్ నిర్మూలనకై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎస్సై యాదగిరి గౌడ్ ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ మహమ్మారి వల్ల ఎందరో తమ ఆరోగ్యాలను కోల్పోయి కుటుంబాలు చిన్న భిన్నం అవుతున్నాయని అన్నారు. డ్రగ్స్ తీసుకోవడం వలన విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. డ్రగ్స్ నుండి యువత దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : మండలంలోని కొన సముందర్ గ్రామంలో డ్రగ్స్ నిర్మూలన ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో గ్రామంలోని పురవీధుల గుండా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మధుపాల్ మాట్లాడుతూ.. డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. యువత మాదక దవ్యాలకు అలవాటు పడి ఆరోగ్యంతో పాటు జీవితాన్ని నాశనం చేసుకోవద్దు అన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు లక్ష్మీ నరసయ్య, ఉపాధ్యాయులు రమేష్, దేవదాస్, నరేష్, జ్ఞానేశ్వర్, సంతోష్, రమేష్ బాబు, నర్సారెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి : ప్రతి ఒక్కరి సహకారం అందినప్పుడే డ్రగ్స్ అనే మహమ్మారిని నిర్మించగలమని ఎస్సై విక్రమ్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రధాన వీధుల్లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. డ్రగ్స్ అనేది ప్రాణాంతకం, మాదకద్రవ్యాల నుండి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్,లెక్చరర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాల్కొండ : అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పోలీస్ స్టేషన్ నుంచి వన్నెల్ బి ఎక్స్ రోడ్ కూడలి వరకు సాగింది. డ్రగ్స్ వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాల్కొండ ఎస్సై కే.గోపి మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని సూచించారు. మత్తు డ్రగ్స్ మాదకద్రవ్యాల అక్రమ రవాణా విక్రయాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ వినోద్, ఆర్ఐ రాఘవేందర్, పిఆర్టియు మండల అధ్యక్షులు వేల్పూర్ శ్రీనివాస్, పిఈటి రాజ్‌కుమార్, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఫయాజ్, పోలీసు సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ జయవంతరావు, కానిస్టేబుల్ లింగన్న, సతీష్, మల్లేష్ యాదవ్, ప్రశాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: మండలంలోని తాడి బిలోలి గ్రామంలో ప్రపంచ మాదకదవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించినట్టు ఆరోగ్య విస్తీర్ణ అధికారులు శ్రావణ్ కుమార్, కరిపె రవీందర్ స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి లక్ష్మీనారాయణ, ఆరోగ్య కార్యకర్తలు మంజుల, రామకృష్ణ, రాధిక, చిన్నయ్య, ఆశ వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని పలు గ్రామాలలోని పాఠశాలల్లో అంతర్జాతీయ మత్తు పదార్థాల అక్రమ రవాణాపై అవగాహన కల్పిస్తూ షార్ట్ ఫిలిం ద్వారా ప్రదర్శన నిర్వహించినట్టు ఎస్ఐ తిరుపతి తెలిపారు. మండలకేంద్రంలో అవగాహన ర్యాలీ, వ్యాస రచన, అవగాహన సదస్సు నిర్వహించామని ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులను చెడు అలవాట్లకు దూరంగా ఉంచాలని, డ్రగ్ వినియోగం అరికట్టుటకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని గాంధీ నగర్ లో గల ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో షార్ట్ ఫిలిం ద్వారా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్, స్కూల్ జాక్రంపల్లి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పంచాయతీ కార్యదర్శి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భీంగల్: గంజాయి లాంటి మత్తు పదార్థాలతో ఆరోగ్యం దెబ్బతింటుందని భీంగల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వల్ల శరీరం నియంత్రణ కోల్పోయి అనేక అనారోగ్య సమస్యలు కలుగుతాయి అన్నారు. అనంతరం కళాశాల నుండి బస్టాండ్ వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ చిరంజీవి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అజయ్ పవర్, ఏఎస్ఐ చిరంజీవి, కళాశాల లెక్చరర్లు ఉన్నారు.



జక్రాన్‌పల్లిలో..



బోధన్‌లో..


భీంగల్‌లో..

మహాత్మ జ్యోతి బాపూలే

జాతీయ అవార్డు అందుకున్న నాగంపేట్ వాసి

నవతెలంగాణ-ముప్కాల్
నేషనల్ అవార్డు-2024 గాను మహాత్మ జ్యోతి భాపూలే జాతీయ అవార్డును నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం నాగంపేట్ గ్రామానికి చెందిన సుంకే విక్రమ్ అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన 'బహుజన సాహిత్య అకాడమీ' 7వ తెలంగాణ రాష్ట్ర కాన్ఫరెన్స్‌లో 'బీఎస్‌ఏ' జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. బహుజన సాహిత్య అకాడమీ దేశంలో నలుమూలల దాదాపు 27 రాష్ట్రాల్లో, ప్రపంచంలోని 8 దేశాలలో పని చేస్తున్నట్లు జాతీయ అధ్యక్షులు రాధాకృష్ణ ఈ సందర్భంగా తెలిపారు. ఈ నెల 10న మహారాష్ట్రలోని పూణేలో జరగాల్సిన కార్యక్రమం కొన్ని అనివార్య కారణాల రీత్యా వాయిదా పడటంతో ఇక్కడ నిర్వహించినట్టు తెలిపారు. సామాజిక సేవా, విద్యారంగంలో బహుజన నాయకుడిగా మహాత్మ ఫౌండేషన్ పేరిట విశేష కృషి చేసినందుకు నాగంపేట్ వాసి విక్రమ్ ఈ అవార్డుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. అకాడమీ తరుపున ప్రతి ఏటా ప్రజా ఉద్యమకారులకు, సంఘ సేవకులకు, కవులకు, రచయితలకు, స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డు లను అందజేస్తున్నట్లు తెలియజేశారు. నాగంపేట్ గ్రామానికి చెందిన సుంకే విక్రమ్ ఇట్టి అవార్డ్‌కు ఎంపిక కావడం పట్ల పలువురు ప్రముఖులు, మండల వాసులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జాతీయ అవార్డు అందుకుంటున్న సుంకే విక్రమ్

గంజాయి, మత్తు పదార్థాల నివారణపై అవగాహన

నవతెలంగాణ-ఏర్గట్ల
మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్సై మచ్చేంధర్ రెడ్డి విద్యార్థులకు గంజాయి, మత్తు పదార్థాలపై బుధవారం అవగాహన కల్పించారు.గ్రామంలో ఎవరైనా గంజాయి అమ్మినా, పీల్చిన తమ దృష్టికి తేవాలని, గంజాయి మహమ్మారి నిర్మూలనలో ప్రజలు తమ వంతుగా కృషిచేయాలని కోరారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందులోభాగంగా ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నర్సరీలో లక్ష్యం మేరకు మొక్కలు సిద్ధం చేయాలి

- ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
నర్సరీల్లో నిర్దేశించిన లక్ష్యం మేరకు వివిధ రకాల మొక్కలను సిద్ధం చేయాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని నాగపూర్, చౌట్‌పల్లి గ్రామాల్లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో హరితహారంలో నాటిన మొక్కలు చనిపోయిన, ఎండిపోయిన వాటి ప్రదేశంలో కొత్త మొక్కలను నాటించాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. వర్షాకాలం ఆరంభమైనప్పటికిని ఎండలు ఎక్కువగా ఉన్నందున నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నర్సరీ నిర్వాహకులకు తెలిపారు. ఉదయం సాయంత్రం వేళల్లో మొక్కలకు నీటిని అందించాలన్నారు. నాటిన మొక్కల్లో 60 శాతంపైగా మొక్కలు బతికేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు. నర్సరీ నిర్వహణ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సదానంద్, పంచాయతీ కార్యదర్శులు గంగాజమున, సంధ్య, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు సేవలు అభినందనీయం

- పిల్లలకు నోట్‌బుక్స్, స్టేషనరీ వితరణ

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రానికి చెందిన బండివార్ గోవింద్ అనే హెూంగార్డు స్వచ్ఛందంగా పోచమ్మ గల్లి, రథం గల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు, అంగన్‌వాడీలో చదువుకునే చిన్నారులకు ఆయన చేతుల మీదగా నోట్ బుక్స్, పెన్సిళ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్, పోలీస్ శాఖ అధికారులు మాట్లాడుతూ.. హెూంగార్డు ప్రతి సంవత్సరం స్వచ్ఛందంగా అందించే సేవలు అభినందనీయంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, అంగనవాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



నోట్‌బుక్స్, పెన్నులు అందజేస్తున్న హోంగార్డు

చిన్నఎడ్గిలో నీటి సమస్య పరిష్కారం

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని చిన్న ఎడ్గి గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ఏఈ నయూమ్ అధ్వర్యంలో మంచి నీటీ సమస్యను ఎమ్మెలే ఆదేశాల మేరకు పరిష్కరించారని తెలిపారు. బుదువారం చిన్న ఎడ్గి గ్రామంలోని నీటీ కులాయిలను ఏఈ పరీశీలించారు. ఏఈ మాట్లాడుతూ.. గ్రామములోని దళిత కాలనీలో తీవ్ర నీటీ సమస్యను గత కొద్ది రోజలుగా ఎదురుకొంటున్నారు. ఇట్టి విషయం ఎమ్మెలే తోట లక్ష్మీకాంతారావ్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. సింగల్ ఫేజ్ మోటారు బిగించి నీటీని పునరుద్దరించడంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేసారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, జీపీ సెక్రటి షిండే విజయ్, తదితరులు పాల్గొన్నారు.



బోరుకు మోటార్ బిగింపు

నూతన పీఆర్‌సీలో మున్సిపల్ కార్మికులకు

వేతనంగా రూ.26 వేలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్
- కలెక్టరేట్ వద్ద మున్సిపల్ కార్మికుల ధర్నా

నవతెలంగాణ-కామారెడ్డి

నూతన పీఆర్‌సీ ప్రకారం మున్సిపల్ కార్మికులకు వేతనంగా రూ.26 వేలు నిర్ణయించిచెల్లించాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కామారెడ్డి కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కన్విన చంద్రశేఖర్, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షలు కందారపు రాజనర్సు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో కాంట్రాక్టు ఔట్సోర్సింగ్, ఎస్ఎంఆర్. ఫిక్స్‌డ్ పే తదితర పద్ధతుల్లో ఉద్యోగులు, కార్మకులు పని చేస్తున్నారన్నారు. పట్టణాలలో, నగరాలలో ప్రజల ఆరోగ్యం పట్ల నిరంతరంగా శ్రమిస్తున్నా మున్సిపల్ సిబ్బంది అడుగడుగునా విపక్షతకు గురౌతున్నారన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించబోయే 2వ పిఆర్సిలో కనీస వేతనం రూ.26,000/- లుగా నిర్ణయించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. జీఓఆర్టి నెం.60, 63 లలో నిర్ణయించిన విధంగా కేటగిరీల వారీగా వేతనాలను అమలు చేయాలన్నారు. జీఓఆర్టి నెం. 1037లో ప్రతిపా దించిన మున్సిపాల్టీలలో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సేవలను థర్డ్ పార్టీకి అప్పజెప్పాలనే నిర్ణయా లను ఉపసంహ రించుకోవాలి. ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్-పే కార్మికులను పర్మినెంట్ చేయాలని అన్నారు.



కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు

ఆంధ్రప్రదేశ్లో మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్నట్లుగానే తెలంగాణాలో రూ.21,000/- ల వేతనం చెల్లించాలన్నారు. కొత్తగా నియమించుకున్న కార్మికులకు పాత కార్మికులతో సమానంగా వేతనాలు చెల్లించాలన్నారు. ప్రమాదాల్లో మరణిస్తున్న కార్మికులకు రూ.25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలని, దహన సంస్కారాలకు రూ.30,000/-లు ఇవ్వాలన్నారు. వయస్సు మీరిన, అనారోగ్యానికి గురైన కార్మికునికి రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలనీ, వారి కుటుంబంలోని వారసులకు అదే ఉద్యోగం కల్పించాలన్నారు. ఆదివారాలు, పండుగ సెలవులు, 8 గంటల పని దినాన్ని అమలు చేయాలనీ, దీన్ని వాటర్ వర్క్ కార్మికులకు వర్తింపజేయాలన్నారు. ధర్నా అనంతరం అదనపు కలెక్టర్కు వినతి పత్రాన్ని అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్ దీపక్ , కట్యాల ప్రభు, బాన్సువాడ మున్సిపల్ అధ్యక్షుడు రాజు, బుజ్జిగారి సాయిలు, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బోకే జ్యోతి, విజయ్, ఎల్ బుధవా, నరసవ్వ, కందారం రాజమణి , బాన్సువాడ మున్సిపల్ నాయకులు రాజు, సాయిలు, కృష్ణ, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేట్ స్కూళ్లల్లో ఫీజు దోపిడీ అరికట్టాలి

ఐక్య విద్యార్థి సంఘాల డిమాండ్

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రయి వేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయ కులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏఐఎఫ్‌డీఎస్, టీజెఏస్, బిసివిఎస్, పిడిఎస్‌యు, జీవీఎస్, ఏఐఎఫ్‌డీవై ఐక్య విద్యార్థి సంఘాల సమావేశంలో విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడారు. జిల్లాలో ఉన్నటువంటి ప్రయివేటు పాఠశాలల్లో ఇష్టానుసారంగా ఫీజులు పెచుతున్నారని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, బూట్లు, టై ఇతరత్రా వస్తువులను అధిక ధరలకు పాఠశాలల్లోనే విక్రయిస్తూ విద్యాహక్కు చట్టాన్ని నీరుగారుస్తున్నారని తెలిపారు. ప్రవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తూ సామాన్య ప్రజలపై మోయలేని భారం పెడుతున్నారన్నారు. ఎలాంటి మౌలిక సదుపాయాలు లేకున్నా రేకుల షెడ్లుల్లో, అపార్ట్మెంట్‌లలో నడుపుతున్నారని పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా నిమ్మకు నీరెత్తిన విధంగా వ్యవహరిస్తున్నారని ఇకనైనా నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోకపోతే డీఈవో కార్యాలయాన్ని వేలాది మందితో ముట్టడిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జబ్బర్ నాయక్, టీజేఎస్ జిల్లా అధ్యక్షులు కుంబాల లక్ష్మణ్ యాదవ్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సతీష్, జీవీఎస్ జిల్లా అధ్యక్షులు వినోద్, ఏఐఎఫ్డీవై నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

విద్యాసంస్థల బంద్ విజయవంతం

నవతెలంగాణ-సదాశివనగర్

ప్రభుత్వ స్కూళ్లల్లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఇచ్చిన పిలుపు మేరకు విద్యాసంస్థల బంద్ విజయవంతం అయినట్టు ఏబీవీపీ కన్వీనర్ వడ్ల శ్రీరామ్ బుధవారం తెలిపారు. మండలంలోని ప్రైవేటు పాఠశాలలను స్వచ్ఛందంగా మూసివేసినట్టు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో యాజమాన్యాలు ఫీజులు అధికంగా వసూలు చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు ఇప్పటికే ప్రభుత్వం స్పందించి పాఠశాల పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళ స్వశక్తి లబ్ధిదారులను ఎంపికచేయాలి : సెర్ప్ డీపీఎం వకుళ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళా శక్తి కేంద్రాలకు అర్హత గల లబ్ధిదారులను గుర్తించి మహిళల జీవితాలలో వెలుగులు నింపాలని బ్యాంకు స్త్రీ నిధి తదితర ఆర్థిక సంస్థల ద్వారా రుణాలు ఇప్పించి మహిళా సంఘాలను ఆర్థికంగా ఎదిగేందుకు ప్రతి ఒక్క వివోఏలు కృషి చేయాలని సెర్ప్ డిపిఎం వకుళ అన్నారు. మండల కేంద్రంలో గల మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం రోజు వివోఏల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .. సంఘాల డాటా ఎంట్రీ త్వరగా తిన పూర్తి చేసి ప్రతి నెల సంఘాల అకౌంటింగ్ సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. వివోఏలు అర్హత గల సంఘాలను గుర్తించి వారికి జీవనోపాదుల పెంపుదలకు బ్యాంకు లీకేజీ ద్వారా రుణాలు ఇప్పించి మెరుగైన జీవన విధానం చేపట్టేలా చూడాలని అన్నారు. పీఎం ఈపిజి పథకం ద్వారా 35% సబ్సిడీతో వివిధ వ్యాపారాలు చేయుటకు మహిళా సంఘాలకు ఆసక్తి ఉన్న సభ్యులను గుర్తించి వారికి శిక్షణ ఇప్పించి జీవనోపాధి కల్పించాలన్నారు. అదేవిధంగా స్త్రీ నిధి రుణాల మొండి బకాయిలు త్వరగా రికవరీ చేయించి కొత్త రుణాలను ఇవ్వాలని శ్రీనిధి రీజనల్ మేనేజర్ కిరణ్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు శాంత, ఏపీఎం జగదీష్ స్విఫ్ ఏపిఎం రాజేందర్, సీసీలు దత్తు, నారాయణ, రమేష్, సాయిలు, రషీద్, శ్రీనివాస్ రెడ్డి, సుజాత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వకుళ

ఉద్యమకారుడి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ ఉద్యమ సమయంలో తనతో పాటే ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమ సహచరుడు సతీవియోగంతో దుఃఖంలో ఉన్నా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన బీజేపీ రాష్ట్ర నాయకులు, సెన్సార్ బోర్డు మెంబర్ రామకృష్ణగుప్తాను బుధవారం కలిసి పరామర్శించారు. మేడిపల్లి సత్యం నివాసంలో కలిసి ఆయన భార్య రూపా దేవి చిత్రపటానికి నివాళులర్పించారు.

రైతులు ఆర్థిక వృద్ధి సాధించాలి

- సాగుతో పాటు కోళ్ల, పాడి, చేపల పెంపకం వంటి లాభాదాయక పనులు చేపట్టాలి
- రైతులకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచన

నవతెలంగాణ-కామారెడ్డి

వ్యయసాయంతో పాటు లాభదాయకమైన పాడిపరిశ్రమ, కోళ్ల పెంపకం, చేపల పెంపకం, ఆయిల్ ఫార్మ్ తోటల పెంపకం వంటి వాటిపై రైతులు దృష్టిసారించి ఆర్థిక వృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. బుధవారం స్థానిక కళాభారతి ఆడిటోరియం లో డెయిరీ టెక్నాలజీ కళాశాల, హైదరాబాద్ కు చెందిన జాతీయ మాంస పరిశోధన సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిసాన్ మేళా ను కలెక్టర్ ప్రారంభించారు. అక్కడ పశు సంవర్ధక శాఖ, ఉద్యాన, మత్స్య శాఖ, విజయ డెయిరీ, పరిశ్రమల శాఖ, నాబార్డు తదితర సంస్థలు తమ ఉత్పత్తులు, పరికరాలతో ఏర్పాటు చేసిన స్టాళ్ళ ను, ప్రైవేట్ విత్తనాలు, ఎరువుల కంపె నీలు, వ్యవసాయ పరికరాలు, ట్రాక్టర్ల స్టాళ్ళ ను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ రైతుల ఆదాయ వనరులను మెరుగుపరచాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా వివిధ పథకాలు అమలు చేస్తూ సబ్సిడీ అందిస్తున్నదని అన్నారు. బ్యాంకర్లు ఉదారంగా రుణాలు అందించి రైతులకు ఇతోధికంగా చేయూత నివ్వాలని కోరారు. కిసాన్ మేళ ల ద్వారా రైతులకు అధునాత వ్యవసా యంలో సూచనలు, మెళకువలు, సాంకేతిక సలహాలు, శాస్త్ర పరిశోధన ఫలాలు అందిస్తూ అవగాహన కలిగిస్తున్నదని, రైతులు వాటిని ఆకళింపు చేసుకొని సంపద పెంపొందించుకునే దిశగా ఎదగాలని కోరారు. పాల ఉత్పత్తి, పశు సంపద పెరగాలంటే నాణ్యమైన మేలుజాతి పాడిపశువుల ఎంపిక చేసుకోవాల న్నారు. ఆడ దూడలకు ఎద సూది (వీర్యం) ఇవ్వడం ద్వారా ఆడ దూడలే పుడతాయని ఇట్టి విషయమై పశు సంవర్ధక శాఖాధికారులను సంప్రదించవల సినదిగా కలెక్టర్ రైతులకు సూచించారు.

జాతీయ మాంస పరిశోధన సంస్థ డైరెక్టర్ బర్బుద్దే మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ అనుబంధ రంగాలలో అవగాహన నిమిత్తం కిసాన్ మేళాలు నిర్వహిస్తున్నదని అన్నారు. జంతు వ్యర్థ పదార్థాల నిర్వహణ, సాంకేతికతలపై ఔత్సాహి కులను ప్రోత్సహిస్తూ శిక్షణ ఇస్తున్నామన్నారు. తెలంగాణ లో మాంసానికి మంచి డిమాండ్ ఉందని, ఆ దిశగా రైతులు గొర్రెలు, కోళ్ల, చేపల పెంపకం పై దృష్టిపెట్టాలని అన్నారు.

కామారెడ్డి డెయిరీ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ శరత్ చంద్ర మాట్లాడుతూ పరిశోధనా ఫలాలు రైతు సోదరులకు అందించాలనే ఉద్దేశ్యంతో కిసాన్ మేళా ఏర్పాటు చేశామన్నారు. వివిధ శాఖల స్టాల్స్ ద్వారా ప్రేరణ కల్పిస్తున్నామని, పాలు , పాల ఉత్పత్తి ప్రాసెసింగ్ ద్వారా ఆదాయం ఎలా మెరుగుపరచుకోవాలో అవగాహన కలిగి స్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల పశు వైద్య కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాస్, యెన్ ఆర్ ఏం ఐ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ బస్వారెడ్డి , జిల్లా పశు సంవర్ధక్ష శాఖాధికారి సింహా రావు, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, విజయ డైయిరీ డిప్యూటీ డైరెక్టర్ నంద కుమారి, కళాశాల విద్యార్థులు, రైతులు, మహిళా రైతులు పాల్గొన్నారు.



చేపల పెంపకం స్టాల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దు

- జిల్లా ఎస్పీ సింధు శర్మ

నవతెలంగాణ-కామారెడ్డి/బిచ్కుంద

విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు బానిసలు కావద్దని జిల్లా ఎస్పీ సింధు శర్మ సూచించారు. బుధవారం కామారెడ్డి పట్టణంలోని సందీపని జూనియర్ కళాశాల వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మదకద్ర వ్యాలకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా ఎస్పీ సింధు శర్మ జండా ఊపి ప్రారంభించారు. కొత్త బస్టాండ్ నుంచి ర్యాలీ నిజాంసాగర్ చౌరస్తా వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందన్నారు. విద్యార్థులు ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే విద్యార్థులకు భవిష్యత్తు ఉండదని తెలిపారు. ఎవరైనా మాదకద్రవ్యాలు స్వీకరించిన, రవాణా చేసిన, విక్రయాలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. మదకద్రవ్యాలు భవిష్యత్తులో వినియోగించబోమని అధికారులు, విద్యార్థులు ఫ్లెక్సీపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి జిల్లా మహిళా, శిశు, వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ అధికారి బావయ్య, కామారెడ్డి డిఎస్పీ నాగేశ్వర్, సిఐలు చంద్రశేఖర్‌రెడ్డి, రామన్, మిషన్ పరివర్తన కమ్యూనిటీ ఎడ్యుకేటర్స్ మోసర్ల శ్రీకాంత్‌రెడ్డి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో సంతకాలు చేస్తున్న ఎస్పీ, విద్యార్థులు



బిచ్కుందలో మానవహారం

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి : సీఐ జగడం నరేశ్

బిచ్కుంద : యువత మత్తు పదార్థాలకు బానిస కాకూడదని చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్తును కాపాడుకోవాలని బిచ్కుంద సీఐ జగడం నరేష్ సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ సందర్భంగా బిచ్కుంద మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ముందర మానవహారం ఏర్పాటు చేసి మత్తు పదార్థాలు వాడకానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మోహన్ రెడ్డి, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగం.. సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఆటంకం

కామారెడ్డి : కామారెడ్డి జిల్లా కేంద్రంలో మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఇన్స్ ఫైర్ సొసైటి ఫర్ రూరల్ డెవలప్ మెంట్ (ఐ.యస్.ఆర్.డి) స్వచ్ఛంద సంస్థ ఆద్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేఖ దినోత్సవం నిర్వహించారు. ఏపియం మొయిజ్, ఐ.యస్.ఆర్.డి స్వచ్ఛంద సంస్థ ప్రదాన కార్యదర్శి అమృత రాజేంధర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా మన సమాజానికి అనేక రకాల సమస్యలను సృష్టిస్తున్నాయన్నారు. ఇది వ్యక్తుల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాలను చూపుతుంద న్నారు. ఈ వ్యసనంతో సామాజిక-ఆర్థిక అభివృద్ధికి ఆటంకంగా మారుతుందన్నారు. మాదకద్రవ్యాల వాడకాన్ని నిరోధించ డానికి, వాటి అక్రమ రవాణాను అరికట్ట డానికి ప్రభుత్వాలు, ప్రైవేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సంస్థలు కలిసి సమన్వయం తో డ్రగ్స్ రహిత జిల్లాగా మారుద్దామని తెలిపారు . ఈ కార్యక్రమలో మండల సమాఖ్య అద్యక్షురాలు కె రాధ, కార్యదర్శి జి గోధవరి, ఐ.యస్.ఆర్.డి స్వచ్ఛంద సంస్థ ప్రతినిది విఠల్ రావు, సిసి రామచంద్ర గౌడ్, గ్రామ సంఘల అద్యక్షులు సిబ్బంది పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో ర్యాలీ..

ఎల్లారెడ్డిలో ర్యాలీ

ఎల్లారెడ్డి : అంతర్జాతీయ మారక ద్రవ్యాల రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఎక్సైజ్ సీఐ షాకీర్ హైమద్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహిం చారు. పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుండి బస్టాండ్ వరకు నిర్వహించిన ర్యాలీలో మత్తు పదార్థాల అమ్మకాలు, వినియోగానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యువకులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ర్యాలీలో ఎక్సైజ్ పోలీసు సిబ్బందితో పాటు డీఎస్పీ శ్రీనివాసులు, సిఐ రవీందర్ నాయక్, ఎస్ఐ మహేష్, విద్యార్థులు, యువకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మంట మనుషుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో వంట చేసే వారి పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు చేసుకోవాలని ప్రిన్సిపల్ వాసంతి బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో వంట చేయడానికి రెండు పోస్టులు ఖాళీ ఉన్నాయని తెలిపారు. ఉదయం 6 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు వంట చేయాల్సి ఉంటుందని, అనుభవం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. గురువారం ఉదయం దరఖాస్తు చేసుకోవాలన్నారు చేసుకున్న వారికి ఒకరోజు వంట పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. రుచికరమైనటువంటి వంటలు చేసేవారు ఈ అవకాశాన్ని సద్విని చేసుకోవాలని ఆమె సూచించారు.

పశువైద్యశాలలో పశువులకు సేవలు అందించాలి

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో బుధవారం ఏడి శ్రీనివాస్ పశువులకు చికిత్స అందించారు. ఈ సందర్భంగా ఏడి శ్రీనివాస్, జడ్పీటీసీ మాట్లాడుతూ దోమకొండ పశువుల ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు అబ్రబోయిన రాజేందర్, మధు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

యూనికార్ప్స్ హెల్త్ ఫౌండేషన్, ఇండియా మెడికల్ మిషన్ ద్వారా ఎల్లారెడ్డి పట్టణ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో గల ఏద వర్షిప్ సెంటర్ చర్చ్ మైదానంలో ఏద వర్షిప్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తారని ఏద వర్షిప్ సెంటర్ వ్యవస్థాపకులు బ్రదర్ శ్రీనివాస చారి,సిస్టర్ హెప్సిబా తెలిపారు. బుధవారం మాట్లాడుతూ స్థానిక ప్రజలకు ఉచిత సేవలు అందించడానికి ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశామని,జనరల్ చెకప్ బీపీ షుగర్ రక్త పరీక్షలు కంటి పరీక్షలు దంత పరీక్షలు చేసి ఉచితంగా మందులు, కంటి అద్దాలు అందిస్తామని స్థానిక ఎల్లారెడ్డి చుట్టుపక్కల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పోగొట్టుకున్న ఫోన్లు అప్పగింత

నవతెలంగాణ-నిజాంసాగర్/కామారెడ్డి

నిజాం సాగర్ మండలం లోని మల్లూరు గ్రామ వాసి బింగి అనిల్, మండలంలోని వడ్డేపల్లి గ్రామ వాసి ధ్యనబోయిన ఎల్లయ్య, మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామవాసి గాండ్ల లక్ష్మణ్ కొన్ని రోజుల క్రితం తమ ఫోన్లను పోగొట్టుకొని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని ఎస్సై సుధాకర్ తెలిపారు. అట్టి ఫోన్లను సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి రికవరీ చేసి ఫిర్యాదు దారులకు బుధవారం అప్పగించినట్టు తెలిపారు. ఫోన్‌కు సంబంధించిరన బిల్లులు గాని, ఫోన్ బాక్స్ గానీ ఎలాంటి ఆధారాలు లేకుండా ఎవరైనా ఫోన్లు విక్రయిస్తే అట్టి ఫోన్లను ఎవరు తీసుకోవద్దని ఆయన సూచించారు.

కామారెడ్డి : దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకరు మొబైల్ పైన పోయిందని దరఖాస్తు చేయగా అట్టి మొబైల్ ఫోన్లో సిఇఆర్ ఆప్ ద్వారా పట్టుకొని బాధితునికి అప్పగించినట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.ఎవరిదైనా ఫోన్ ను అపహరించినట్లయితే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే సిఇఆర్ ఆప్ ద్వారా వెతికి పట్టుకునే అవకాశాలు ఉన్నాయన్నారు.



నిజాంసాగర్‌లో ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ

పిల్లల ఎదుగుదలలో పునాదులు.. అంగన్‌వాడీలు

టీచర్‌ల శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీవో

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/కామారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో అంగన్వాడీ టీచర్లకు జరుగుతున్న శిక్షణ కేంద్రాన్ని గురువారం నాడు ఆర్డీవో ప్రభాకర్,అజీమ్ ప్రేంమ్ జి ఫౌండేషన్ ట్రైనర్ కృష్ణతో కలిసి సందర్శించారు. ఈ శిక్షణ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య అవసరాన్నినూతన విద్య విధానాన్ని చిన్నపిల్లల్లో మెదడు అభివృద్ధి దశల గురించి వివరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న అంగన్వాడీ టీచర్లకు వారు నేర్చుకున్న అంశాలను, బోధనా పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో పిల్లలకు పునాదిగా ఉండాల్సిన బాధ్యత అంగన్వాడీ టీచర్లదే అని అన్నారు. గ్రామ స్థాయిలో పిల్లలకు గ్రోత్ మేళ నిర్వహించాలని, అందులో వివక్ష లేకుండా గ్రామంలోని అన్ని వర్గాలకు చెందిన పిల్లలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ఎల్లారెడ్డి ప్రాజెక్టు సిడిపిఓ సరిత, మాస్టర్ ట్రైనర్ స్వరూప,హారతి, సూపర్వైజర్లు లతా, భారతి,వినోదిని, ఈశ్వరిబాయి శిక్షణకు వచ్చిన అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో

అంగన్‌వాడీలో గ్రోత్ మేళ

రామారెడ్డి : అంగన్‌వాడీలో ప్రతి నెల 25 నుండి 30వ తేదీ వరకు గ్రోత్ మేళ నిర్వహిస్తున్నట్లు టీచర్లు తెలిపారు. 0 నుండి ఐదు సంవత్సరాలు లోపు పిల్లలను, తూకం వేసి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి, తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. మండలంలోని రామారెడ్డితో పాటు మద్దికుంట, రెడ్డిపేట్, పోసానిపేట, తదితర గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవాల్లో భాగంగా (ఏక్ పేడ్ మా కా నామ్ - అమ్మ పేరిట ఒక మొక్క) కార్యక్రమం లో భాగంగా బిజెపి నాయకులు కార్యకర్తలకు మొక్కల పంపిణీ కార్యక్రమనీ బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 5 వ తేదిన ప్రపంచ పర్యావరణ దినం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఏక్ పేడ్ మా కే నామ్ ప్రచార ఉద్యమాన్ని ప్రారంభించారని, మోదీ దిల్లీ లోని బుద్ధ జయంతి పార్కులో ఒక రావి మొక్కను నాటారనీ తెలిపారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల వితరణ



నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆరు నుండి పదవ తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాలు బుధవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు దొంతుల రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేసిన నోటు పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం మోతే మోహన్, విటల్, శోభ, లింబాద్రి, ,భాను ప్రకాష్, గంగామోహన్, లావణ్య, వీడీసీ సభ్యులు ఆకుల లక్ష్మణ్, గంగారం, రాజన్న, ఎండి సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్లో మూత్రశాల ప్రారంభం



నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని బెజ్జోర హైస్కూల్‌లో బెజ్జోర గ్రామానికి చెందిన సూల్ల నవీన్ సొంతఖర్చులు లక్ష ఇరవైవేల రూపాయలతో బాలికల కోసం మూత్ర శాలను నిర్మించారు. ఆయన తండ్రి సూల్ల నడ్పి లింబయ్య (గుండయ్య), కుమార్తె సూల్ల నందిని సమక్షంలో బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హఫీజుద్దీన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజ్ కుమార్, ఉపాధ్యాయ బృందం, గ్రామస్థులు ఓరగంటి. గంగాధర్, గ్రామ సెక్రటరీ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సంఘాలను బలోపేతం చేసేలా చర్యలు చేపట్టాం

- ఎన్డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సంఘాలను బలోపేతం చేసేలా చర్యలు చేపడతామని ఎన్డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్ రెడ్డి అన్నారు. ది నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రధాన కార్యాలయం నందు 102 వ వార్షిక మహాజన సభను బ్యాంకు అధ్యక్షులు కుంట రమేష్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, ఐడిసిఎంఎస్ అధ్యక్షులు ఇంద్ర సేనా రెడ్డి, బ్యాంకు డైరక్టర్లు, ఐడీసీఎంఎస్ డైరక్టర్లు, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార సంఘాల చైర్మన్లు, బ్యాంకు సిఈఓ నాగభూషణం వందే, బ్యాంకు ఉన్నతాధికారులు పాల్గొనారు. మొదట ఏకకాలంలో 2 లక్షలు రుణమాఫీ ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మహాజన సభలో రైతులను ఉద్దేశించి సంఘాల చైర్మన్లు లేవనెత్తిన అంశాలను సమన్వయంగా పరిష్కారం చేస్తానని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సంఘాలను బలోపేతం చేసేలా పలు చర్యలు చేపడతామని చెప్పారు. రైతులకు, రైతు బీమా 2 లక్షలకు పెంచారని తెలిపారు. ఎస్ఏట లోన్ లిమిట్ 2 లక్షలకు పెంచుటకు మహాజనసభలో తీర్మానించి టిఎస్సిఏబి నకు పంపుతానని తెలిపారు. అలాగే బ్యాంకు 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలను నిర్వహించుటకు బ్యాంకు అధ్యక్షులు సహకార శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వర రావుని కలిసి వారి సమయం మేరకు త్వరలో తేదీని ప్రకటిస్తామని అన్నారు. ప్రస్తుతం పంట రుణాలకి సంబంధించి మన బ్యాంకు ఇప్పటి వరకు అసైన్మెంట్ భూములకు ఎస్ఏఓ పంట రుణం ఇవ్వడం లేదు కానీ సంఘాల చైర్మన్ల అభిప్రాయం మేరకు ఈ విషయంపై బ్యాంకు అధ్యక్షులు సానుకులంగా స్పందించి టిఎస్సిఏబి వారి అనుమతి కోరుటకు తగు ప్రతిపాదనలు పంపేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. మార్క్‌ఫెడ్ నుండి పిఏసిఎస్‌లకు ఫర్టిలైజర్ కొనుగోలు కోసం క్రెడిట్ ఇచ్చేలా తీర్మానించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు



మాట్లాడుతున్న చైర్మన్ రమేష్‌రెడ్డి



పాల్గొన్న చైర్మన్లు, డైరెక్టర్లు

బ్లడ్‌క్యాన్సర్‌పై ఆందోళన వద్దు

- బ్లడ్ క్యాన్సర్‌పై అపోహలతో ఆందోళన చెందవద్దు
- యశోద హాస్పిటల్ సీనియర్ వైద్యులు గణేష్ జైషేత్వాల్ వెల్లడి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇటీవల కాలంలో ప్రజల్లో ప్రతి ఒక్కరిలో బ్లడ్ క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు ఎక్కువయ్యారని 2024 సంవత్సరంలో ఈ క్యాన్సర్‌తో బాధపడే బ్లడ్ డిసార్డర్ బోన్ మ్యారో ఫాస్ట్ ప్లాంట్ సక్సెస్ రేట్లు 80 నుండి 90శాతంకు మించిపోయాయని హైదరాబాద్ హైటెక్ సిటీకి చెందిన ప్రముఖ వైద్యులు జైషేత్వాల్ పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్లోని యశోద హాస్పిటల్ హైటెక్ సిటీ హాస్పిటల్‌లో బ్లడ్ క్యాన్సర్, బ్లడ్ డిజార్డర్‌పై విజయం సాధించిన ప్రపంచ రక్త మజ్జ మార్పిడి అవగాహన మాసం సందర్భంగా కాంకర్స్‌తో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లడ్ క్యాన్సర్ రుగ్మతలు పూర్తిగా నయం చేయడమే కాకుండా ఈ చికిత్స ద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చని ఆయన తెలిపారు. ఈ బ్లడ్ క్యాన్సర్‌ను ద్రవ క్యాన్సర్ అనే పేరుతో కూడా పిలవబడడం జరుగుతుందన్నారు. ఇందులో లుకేమియా, లింఫోమా, మల్టిపుల్ మైలోమా వంటి వివిధ రకాల క్యాన్సర్లు ఉన్నాయని ఆయన వివరించారు. భారత దేశంలో తెలంగాణలో బ్లడ్ క్యాన్సర్ తో బాధపడే వారు ప్రత్యేక పెరుగుతూనే ఉన్నారని, దీనికి కారణం ఆధునిక నాగరికతతో సహా అనేక కారణాలు ఉన్నాయని అన్నారు. బ్లడ్ క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన లేకపోవడానికి కారణం ప్రజల్లో చైతన్యం లేకపోవడమే ముఖ్య కారణం అని ఆయన స్పష్టం చేశారు. బ్లడ్ క్యాన్సర్, బోన్ క్యాన్సర్లలో ఎంతోమంది బాధపడుతున్నారని, వారందరికీ శాశ్వత పరిష్కారం కోసం యశోద హైటెక్ సిటీ యాజమాన్యం అండగా నిలుస్తుందని తెలిపారు. ఇలా ఎంతోమంది ప్రాణాలను నిలబెట్టిన ఘనత తమదని అన్నారు. తమ ఆసుపత్రిలో పేద ప్రజలకు క్యాన్సర్‌తో బాధపడే వారికి కూడా ప్రత్యేక వైద్య సదుపాయాలు రాయితీ కూడా అందిస్తామన్నారు. దేశంలో రోజురోజుకు పెరిగిపోతున్న బెడ్ క్యాన్సర్లు నియంత్రిం చేందుకు యశోద హాస్పిటల్ వైద్యం అందుబాటులో ఉందని ఆయన వెల్లడించారు.



మాట్లాడుతున్న వైద్యులు గణేష్ జైషేత్వాల్

ధృవ పాఠశాల పనులు నిలిపివేత

- నవతెలంగాణ వరుస కథనాలకు స్పందించిన విద్యాశాఖాధికారులు
- ధృవ స్కూల్ యాజమాన్యాకి నోటీసులు జారీచేసిన పంచాయతీ, విద్యాశాఖ అధికారులు



నిర్మాణంలో ఉన్న స్కూల్ భవనానికి నోటీసు అతికిస్తున్న గ్రామ కార్యదర్శి

నవతెలంగాణ-నందిపేట్

అనుమతులు ఓ చోట... అడ్మిషన్లు మరోచోట అంటూ నవతెలంగాణ వరుస కథనాలకు పంచాయతీ అధికారులతో పాటు విద్యాశాఖ అధికారులు బుధవారం స్పందించారు. గ్రామపంచాయతీ నుంచి ఇంటి నిర్మాణం కొరకు అనుమతి తీసుకుని ప్రవేట్ పాఠశాల నడిపిస్తున్న ధృవ ప్రయివేట్ పాఠశాల యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. దీంతోపాటు విద్యాశాఖ అధికారులు సైతం అనుమతులు లేకుండా పాఠశాలలో అడ్మిషన్లు పుస్తకాలు అమ్మినందుకు వారు సైతం నోటీసులు జారీ చేశారు. మండల కేంద్రంలో ధృవ స్కూల్ ఇంటి నిర్మాణం కొరకు అనుమతి తీసుకొని, కమర్షియల్ స్కూల్ భవనంగా మార్చి పనులు జరుగుతుండగానే అడ్మిషన్లు చేస్తు, పుస్తకాలను అమ్ముతూ ఉన్న విషయం నవ తెలంగాణ దిన పత్రిక వెలుగులో తీసుకొచ్చింది. స్కూల్ యాజమానికి డిటీసీపీ అనుమతి పొందడంతోపాటు విద్యాశాఖ అధికారుల నుంచి అనుమతి పొందేవరకు ఇంటి నిర్మాణం ఆపాలని ఎలాంటి అడ్మిషన్లు తరగతులు నిర్వహించరాదని నోటీసులో పేర్కొన్నట్టు ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ నవీన్ నవ తెలంగాణకు తెలిపారు.

దండోరా రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ - బోధన్

జూలై 7న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించే దండోరా రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని టి-ఎంఆర్పీఎస్ నాయకులు కోరారు. బుధవారం బోధన్ పట్టణంలో రజతోత్సవ వేడుకల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనకై ఏర్పడిన ఎమ్మార్పీఎస్ రజతోత్సవాలను జరుపుకోవడం గర్వకారణం ఉందని అన్నారు. ఇన్ని సంవత్సరాల కాలంలో ఎస్సీ వర్గీకరణ సాధన కాకుండా ఎన్నో సామాజిక అంశాలపై ఉద్యమించిందని అన్నారు. కావున ఈ రజతోత్సవ వేడుకలను ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించడమే కాకుండా హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలు హాజరుకావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు విద్యాసాగర్, సుధాకర్, ఈదురు పోశెట్టి పెద్దింటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్ ప్రశాంతం

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని, ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల అక్రమ ఫీజులను అరికట్టి, ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని , పాఠశాల విద్యలో నెలకొన్న ఇతర సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో చేపట్టిన పాఠశాలల బంద్ ప్రశాంతంగా జరిగింది. ఏబీవీపీ పిలుపు మేరకు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. దాంతో విద్యార్థులు ఇండ్లకు వెళ్లిపోయారు. ఏబీవీపీ నాయకులను బోధన్ పోలీసులు ఆర్డీఓ కార్యాలయం వద్ద అదుపులో తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు.

పాఠశాలల బంద్‌పై పోలీసుల నజర్...

ఏబీవీపీ పిలుపు మేరకు పాఠశాలలను, ప్రయివేటు విద్యా సంస్థలు బంద్ నిర్వహించడంతో ఏబీవీపీ నాయకుల తీరుపై బోధన్ పట్టణ పోలీసులు పాఠశాలలకు వెళ్లి ఆరా తీశారు. పాఠశాలలను స్వచ్ఛందంగా బంద్ చేశారా.. ఎవరైన బలవంతంగా బంద్ చేయించారు అంటు ఉపాధ్యాయులను ఆరా తీశారు. అలాగే ఇంటలిజెన్స్ పోలీసులు సైతం పాఠశాలలను సందర్శించి బంద్‌పై ఆరా తీశారు.

ముగిసిన ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, ఎలక్ట్రీషియన్ శిక్షణ



టూల్‌కిట్ అందజేస్తున్న మేనేజర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డిచ్ పల్లి ఆధ్వర్యంలో ఫొటో గ్రఫీ, వీడియో గ్రఫి, ఎలక్ట్రీషియన్ లకు గత 30 రోజుల శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చీఫ్ మేనేజర్, అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం నిజామాబాద్ రవి పాల్గొని శిక్షణార్థులకు ధృవీకరణ పత్రాలు, టూల్ కిట్ అందజేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ.. ప్రస్తుత కాలం లో ఫోటోగ్రఫీ చేసే వాళ్లకు చాలా మంచి డిమాండ్ ఉందని, పెళ్లిళ్ల, పండగలకు ఫోటోగ్రాఫర్లు చాలా ముఖ్యమని అన్నారు. ప్రస్తుతం పెళ్ళిళ్ళలను ఒక సినిమాలాగా చిత్రీకరిస్తున్నారని వివరించారు. ఒక్క కార్యక్రమం నిర్వహిస్తే దానికి లక్షల్లో డబ్బులు తీసుకుంటున్నారని, ఈ శిక్షణా ద్వారా జీవితంలో చక్కగా స్తిరపడవచ్చని సూచించారు. ఎస్బిఐ ద్వారా రుణాలు అందిస్తామని అన్నారు. అలాగే ఎలక్ట్రీషియన్‌కు కూడా చాలా డిమాండ్ ఉందని, కొత్తగా ఇల్లు కట్టుకునే వారు చాలా ఉన్నారని, అందరికీ ఎలక్ట్రీషియన్‌లు దొరకడం ప్రస్తుతం మార్కెట్లో డిమాండ్ ఉందన్నారు. చక్కగా పని చేసి ఈ రంగంలో స్థిర పడాలని సూచించారు. పని చేసేటపుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని, కరెంట్‌తో చాలా ప్రమాదాలు ఉంటాయని అందరూ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని పేర్కొన్నారు. బ్యాంక్ లో అకౌంట్ లేని వాళ్ళు ఎస్బిఐ లో జీరో అకౌంట్ ఓపెన్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ డైరక్టర్ సుంకం శ్రీనివాస్, ఆఫీసు సిబ్బంది బాగ్యాలక్ష్మి, రామకృష్ణ, నవీన్, రంజిత్, గెస్ట్ ఫాకల్టీ లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల క్యాంప్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మహారాష్ట్ర లోని వార్ధ సేవాగ్రం ఆశ్రమంలో ఈనెల 24,25,26,27 తేదీల్లో జాతీయ రాజీవ్ పంచాయతీ రాజ్ సంఘటన్ అధ్యక్షులు మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యకర్తల క్యాంప్ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, దేశంలో 23 రాష్ట్రాలకు చెందిన ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ శిక్షణ శిబిరంలో రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ విస్తరణ గురించి, మహాత్మ గాంధీ ఆశయాలు, ఆలోచన గురించి, సమాజ సేవ గురించి వివరించారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జాతీయ అర్ జిపి అర్ఎస్ ఉపాధ్యక్షులు హర్షవర్ధన్ పాల్గొన్నారు.

వనమహోత్సవానికి మొక్కలు సిద్ధం చేయాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అధ్యక్షతన వనమహోత్సవం, ప్లాంటేషన్‌పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో వనమహోత్సవంలో భాగంగా ప్లాంటేషన్ కోసం మొక్కలను సిద్ధం చేయాలని ఆయా గ్రామాల పంచాయతీ ప్రత్యేక అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో నూతనంగా నిర్వహించనున్న మరుగుదొడ్ల సర్వేను వేగవంతం చేయాలని, కమ్యూనిటీ మరుగుదొడ్ల కాంప్లెక్స్ నిర్మాణాల విషయంలో స్థలాల సేకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగంగా ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు చేపట్టాలని, పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను త్వరగా పూర్తిచేసేలా కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో పంచాయతీరాజ్, రోడ్డు భవనాల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సదాశివ్, ఈజీఎస్ ఏపీవో విద్యనంద్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఈజీఎస్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

డీవి కృష్ణ స్ఫూర్తితో...

బలమైన విప్లవోద్యమాన్ని నిర్మిద్దాం

సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా

నవతెలంగాణ-ధర్పల్లి/సిరికొండ

విప్లవోద్యమ నాయకుడు, సిపిఐ (ఎంఎల్)ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి అమరుడు డీవి కృష్ణ స్ఫూర్తితో బలమైన విప్లవోద్యమాన్ని నిర్మిద్దామని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్.రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం నిజామాబాద్‌లో డీవి కృష్ణ రెండవ వర్ధంతి, స్థూప ఆవిష్కరణ కార్యక్రమానికి ధర్పల్లి, సిరికొండ మండలాల నుంచి పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలితరం విప్లవోద్యమ నాయకుల్లో ముందు వరసలో నిలిచిన విప్లవ నాయకుడని, నేటికి తరం కమ్యూనిస్టు విప్లవకారులకు అధర్షమూర్తి అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో దామోదర్, సాయరెడ్డి, రమ, మండల నాయకులు రమేష్, కిషోర్, ఆశిస్, కిశోర్, పుష్పలత, జమున, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.



ధరల్లి: నిజామాబాద్‌కు తరలుతున్న నాయకులు

సిరికొండ: భారత విప్లవోద్యమంలో విప్లవ శిఖరం కామ్రేడ్: డీవీ.కృష్ణ అని, అన్న లక్ష్యసాధనకు పూనుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) మండల నాయకులు రమేష్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గడ్కోల్ గ్రామంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మాజీ రాష్ట్ర కార్యదర్శి, అమరుడు కామ్రేడ్:దుర్గంపూడి:వెంకట కృష్ణ రెండో వర్ధంతిని నిర్వహించారు. పిడివాదం, మార్పును చూడని ఏ మార్గం కూడా పురోగతిని సాధించవని ఆయన ఆచరణాత్మక ప్రజాపంథా మార్గంను నిర్మించిన నిర్మాణ ధీరశాలి అని ఆయన కొనియాడారు. విమర్శలను ఎదుర్కొని, అవమానాలను ఆత్మస్థైర్యంతో డీకొట్టిన విప్లవ దిగ్గజం అని అన్నారు. పల్లెల్లో ప్రజాసంఘాల నిర్మాణంకు పునాది వేసి జననేత అయ్యాడని తెలిపారు. అతివాదం మితవాదం రెండు ప్రమాదం అని ప్రజాపంథానే తుది మార్గం అని చాటాడని అన్నారు. నిజామాబాద్ నుండి నిమ్మపల్లి వరకు దొరల గడీలను జనం గుత్పలతో ఉరికించిన విప్లవ పోరుకేతనం అని తెలిపారు. శాస్త్రీయ మార్క్సిజం నేటి భారత విప్లవ విజయానికి అవసరం అని గుర్తించి భోధించిన గొప్ప మార్క్సిస్ట్ సిద్ధాంత వేత్తఅని అన్నారు. అన్న విప్లవ రాజకీయాలను ముందుకు తీసుకుపోవాడానికి ఎర్రసైనికుల్లా నిలబడుదాం అని అన్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్, మండల నాయకులు దామోదర్, రమ, కిషోర్, సాయరెడ్డి, కిషోర్, లావణ్య జెమున, చింటు, రాజేశ్వర్ పాల్గొన్నారు.



సిరికొండ:నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

అడవి జంతువును తప్పించబోయి బోల్తాపడ్డ కారు



బోల్తాపడ్డ కారు

నవతెలంగాణ-మోపాల్

యాచారం గ్రామానికి చెందిన మలవత్ ప్రభాకర్ అనే వ్యక్తి తన భార్య లలిత బాయితో కలిసి తన ఆరోగ్యం దృష్ట్యా నిజామాబాద్‌లోని ఆసుపత్రిలో చూపించుకోవడానికి బుధవారం వెళ్లారు. తిరిగి తన ఇంటికి చేరుకునే సందర్భంలో అమ్రాబాద్ గ్రామ శివారు అడవి ప్రాంతంలోకి చేరుకోగా అకస్మాత్తుగా ఒక అడవి జంతువు తన కారు ముందు నుండి వెళ్లింది. దానిని తప్పించబోయే క్రమంలో రోడ్డు పక్కన ఉన్న పెద్ద బండరాయిని తన వాహనం ఢీకొనడంతో కారు బోల్తా పడింది. ఈఘటనలో తన భార్యకు తీవ్రగాయాలై అక్కడికక్కడే చనిపోగా ప్రభాకర్‌కి తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని తన కుమారుడు గాయాలతో ఉండగా కోడలు అప్పటికే చనిపోయింది. కుమారుడిని మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి అత్త హేమ భాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగాధర్ పేర్కొన్నారు



లలిత బాయి (ఫైల్)

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవతెలంగాణ-మాక్లూర్

బైక్‌పైనుండి పడి గాయపడ్డ మండలంలోని చిక్లి గ్రామానికి చెందిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై బుధవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం... చిక్లి గ్రామానికి చెందిన సీఎచ్ గంగాధర్ (45) మంగళవారం రాత్రి అదుపుతప్పి బైక్ పై నుంచి కిందపడి గాయపడ్డాడు. జిల్లా కేంద్రంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి కూతురు, కుమారుడు ఉన్నారని, వారికి వివాహం అయింది. భార్య రుక్మాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



గంగాధర్ (ఫైల్)

మండల సర్వసభ్య సమావేశంలో సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్



మండల ప్రత్యేక సర్వసభ్య సమావేశం విజయవంతంగా జరిగిందని ఎంపీపీ నర్సయ్య బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పాలకవర్గానికి సంబంధించి ఇదే చివరి సమావేశమని, ఈ 5 సంవత్సరాల కాలంలో తమకు సహకరించిన మండల అధికారులకు ఎంపీపీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లోనూ ప్రజలకు సేవ చేసేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మెట్టు సంతోష్ ఎంపీడీవో సాయిరాం, ఎంపీ ఓ శ్రీనివాస్, అంగన్వాడి సూపర్వైజర్ వెంకట రమణమ్మ, మండలంలోని ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తీర్చేందుకు రెండు బోర్ల తవ్వకాలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలో అన్నసాగర్ గ్రామంలో స్థానిక ఎంపిటిసి ఉమాదేవి గురుప్రతాప్ బుధవారం ఎంపీటీసీ నిధులతో గ్రామంలో 2 బోరు బావులు వేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో గత కొంతకాలంగా నీటి ఎద్దడి సమస్యతో గ్రామ ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారని, గ్రామంలో నీటి ఎద్దడి సమస్యను ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు దృష్టికి తీసుకెళ్లామని, ఆయన సానుకూలంగా స్పందించి సహకారం అందించడంతో బోర్లు వేయించామని అన్నారు. గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించిన స్థానిక ఎంపీటీసీ,ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు గురు ప్రతాప్, రామగౌడ్, గంగారెడ్డి, గొల్ల దుర్గయ్య, కాశీరాం, మల్లయ్య, కృష్ణారెడ్డి, మహమ్మద్ అహ్మద్, రాములు, సాయిబాబా, రాజు, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

పదవి ముగిసింది.. రిజర్వేషన్ మారనుందా?

- మద్నూర్ మార్కెట్ కమిటీ రిజర్వేషన్‌పై సర్వత్రా ఉత్కంఠ
- ఎస్సీ మహిళకు రిజర్వేషన్ రానునట్టు స్థానికంగా చర్చలు

నవతెలంగాణ-మద్నూర్



రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులకు ఐదు సంవత్సరాల రిజర్వేషన్ల సమయం పూర్తయినట్టు తెలుస్తోంది. ఇక రాబోయే చైర్మన్ పదవికి రిజర్వేషన్ ఎవరికోసమో అనే చర్చలు జోరుగా వినిపిస్తున్నాయి. కామారెడ్డి జిల్లాలో ప్రఖ్యాతగాంచిన మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రిజర్వేషన్ల సమయం ఐదేళ్లు గడిచిపోయినట్టు ఇక రాబోయేది ఎవరికోసమో అనే దానిపై కూడా ప్రత్యేకంగా చర్చలు వినబడుతున్నాయి. మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి ఎస్సీ మహిళాగా రిజర్వేషన్ వస్తుందనే చర్చలు జోరుగా వినిపిస్తున్నాయి. గడిచిన 5 సంవత్సరాల కాలంలో మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కోసం రిజర్వేషన్లు ఈ విధంగా కొనసాగాయి.. మొదట ఓసీ జనరల్, తర్వాత ఎస్టీ జనరల్, మూడోసారి ఓసి మహిళా, నాలుగోసారి బిసి(బి) జనరల్, ఐదోసారి ఓసి జనరల్‌గా చైర్మన్ పదవులు కొనసాగింది. ఇక చైర్మన్ పదవి కోసం ఏ విధంగా రిజర్వేషన్ వస్తుందనేది మద్నూర్ మార్కెట్ పరిధిలోని మద్నూర్, జుక్కల్, డోంగ్లి మూడు మండలాల జనాలు ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా ఈసారి మొదట ఎస్సీ మహిళగా రిజర్వేషన్ వస్తుందనేది చర్చలు వినబడుతున్నాయి. ఇలాంటి చర్చలు ఎంతవరకు నిజమో కానీ మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ఎదురుచూసిన ఆశావాహులు నిరాశకు గురయ్యే విధంగా కనిపిస్తోంది. ఎందుకంటే ఓసి, బిసి, రిజర్వేషన్ వస్తే ఆశావాహులకు చైర్మన్ పదవిని పొందడా నికి ఆశించవచ్చు కానీ ఎస్సీ, ఎస్సీ మహిళా, రిజర్వేషన్ వస్తే మాత్రం ఆశావాహులు నిరాశకే గురికావాల్సి వస్తుంది. ఈసారి ఎస్సీలకు కేటాయిస్తారని చర్చలు జోరుగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వపరంగా ఐదుసార్లు చైర్మన్ పదవుల కోసం రిజర్వేషన్లు కొనసాగిన తర్వాత మళ్లీ రిజర్వేషన్లు రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా రిజర్వేషన్లు ప్రకటించే అవకాశాలు ఉంటాయని తెలుస్తోంది. మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎవరికోసం అనుకూలమైన రిజర్వేషన్ వస్తుందో వేచి చూడాలి.

నేడు గ్రామపంచాయతీ తైబజార్ వేలంపాట

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం తైబజార్ వేలంపాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను తైబజార్ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తిగలవారు సకాలంలో హాజరై నిబంధనల మేరకు టెండర్ లో పాల్గొనాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

పాఠశాలలో మౌలిక సదుపాయాలు పరిశీలన



మౌలిక సదుపాయాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దూపల్లి, కళ్యాపూర్ గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల నిధులతో చేపట్టిన పనులను ఎంపీడీవో శ్రీనివాస్, పిఆర్ఏఈ వినయ్ కుమార్ బుధవారం పరిశీలించారు. పాఠశాలలు ప్రారంభమై 14 రోజులు కావడంతో మౌలిక సదుపాయాల పనులను వారు పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలను కల్పించకుండా కాంట్రాక్టర్లు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వారు ఆదేశించారు. మండలంలోని దూపల్లి పాఠశాలలోని మరుగుదొడ్లను పరిశీలించారు. కళ్యాపూర్ గ్రామంలో పనులను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పిఆర్టియు మండల అధ్యక్షులు సోమలింగం గౌడ్, దూపల్లి గ్రామ కార్యదర్శి సిహెచ్ సాయి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సివిల్స్‌కు ఉచిత లాంగ్ టర్మ్ కోచింగ్

నవతెలంగాణ-కామారెడ్డి

సివిల్ సర్వీసెస్ లాంగ్ టర్మ్ (ప్రిలిమ్స్ కం మెయిన్స్) పరీక్ష 2025కు కోచింగ్ తరగతులు జూలై 18 నుంచి 2025 ఏప్రిల్ 18 వరకు టీజీ బీసీ స్టడీ సర్కిల్ లక్ష్మీనగర్‌కాలనీ, సైదాబాద్, హైదరాబాద్‌లో ప్రారంభమవుతాయని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి డి.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకట నలో తెలిపారు. ఇందులో 150 మంది అభ్యర్థులకు శిక్షణ ఉండగా అందులో 100 మందికి గాను జులై 7న నిర్వహించే ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థుల నుంచి 100 ప్రతిభవంతులైన విద్యార్థులను ఎంపిక చేయడం కోసం జూన్ 19 నుంచి జులై 3 వరకు ఆన్‌లైన్‌ద్వా రా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. కామా రెడ్డి జిల్లాకు చెందిన అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు www.tgbcstudycircle.egg. gov.in ద్వారా అప్లోడ్ చేయాలని సూచించారు. మరో 50 మంది విద్యార్థులను ఇంతకుముందు యుపిఎస్సి వారు నిర్వహించిన సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్) పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారిని తీసుకోనున్నట్టు తెలిపారు. వారు సంబంధిత పత్రాలతో తేదీ జూలై 3లోగా నేరుగా టిజిబిసి స్టడీ సర్కిల్, లక్ష్మీనగర్ కాలనీ, సైదాబాద్, హైదరాబాద్-500059, దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు లాడ్జింగ్, భోజనం, రవాణా ప్రయోజనం కోసం నెలకు రూ.5000, బుక్‌ఫండ్ కింద మరొక ఐదు వేల రూపాయలు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. గ్రంథాలయ సదుపాయం ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 08462-241055 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు

మతోన్మాద భావజాలాన్ని తిప్పి కొట్టాలి

- ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మతోన్మాద భావజాలాన్ని తిప్పి కొట్టి ప్రజా సమస్యలపై పోరాడినప్పుడే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటామని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మతోన్మాదం దాని పర్యవసానాలు అనే అంశం పైన బుధవారం సదస్సు నిర్వహించారు. ఈసదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ప్రజా సమస్యలను పరిష్కరించటంలో ప్రభుత్వాలు వైఫల్యం చెంది తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవటం కోసం ప్రజల్లో మత విద్వేషాలను రెచ్చగొట్టే పద్ధతులు అవలంభిస్తున్నాయ న్నారు. ఒక మతానికి ఇంకో మతానికి దోషిగా చూపెడుతూ రాజకీయ ప్రయోజనాలను పొందటానికి తద్వారా రాజ్యాధికారంకోసం ప్రయత్నిస్తున్నారని తెలిపారు. గత ఎన్నికల్లో ముస్లింలను చూపెట్టి మత విద్వేషాలను రెచ్చగొట్టే పద్ధతుల్లో ప్రసంగాలు చేసి ప్రజల్లో వైశాల్యాలను పెంచి రామాలయం నిర్మాణం అనే పేరుతో మెజార్టీ హిందువుల ఓట్లను పొందాలని చూశారన్నారు. బిజెపి హిందూ మతోన్మాదాన్ని బూచిగా చూపెట్టి ముస్లిం మైనార్టీల ఓట్లను పొందాలని ఎంఐఎం ప్రయత్నం చేసింది తప్ప ప్రజా సమస్యలను ఎక్కడ ప్రస్తావించలేదని వారు అన్నారు. ఎన్నికల్లో 400 స్థానాలను సాధిస్తామని చెప్పిన బిజెపి, ప్రధాని నరేంద్ర మోడీ ప్రజా వ్యతిరేకతను చూసి తన ప్రసంగాలు మార్చారని అన్నారు. విద్వేషాలు పెరిగే పద్ధతుల్లో మాట్లాడారని ఫలితంగా తిరిగి మూడోసారి అధికారంలోకి వచ్చారని ఆయన అన్నారు. అయినప్పటికీ ప్రజలు గతం కన్నా తక్కువ స్థానాలనే గెలిపించారని తెలిపారు. కుల, మత ప్రాంతాలకు అతీతంగా ప్రజలు తమ సమస్యల పైన సంఘటితంగా పోరాడినప్పుడే సమస్యలు పరిష్కరించవచ్చని గత పోరాటం మనకు చెబుతుందన్నారు.

కూడు, గూడు, గుడ్డతోపాటుగా ఉపాధి అవకాశాలను ప్రాంతీయ అసమానతలు లేకుండా అభివృద్ధి చెందేటట్టు ప్రయత్నం చేసినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అందుకు ప్రజలు సన్నద్ధం కావాలని, మత విద్వేషాలకు ఎక్కడ తావివ్వకుండా ప్రజలందరూ సమైక్యంగా నిలబడాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, పల్లపు వెంకటేష్, శంకర్ గౌడ్, నూర్జహాన్, జిల్లా కమిటీ సభ్యులు వై గంగాధర్, సుజాత, నన్నేసాబ్, జంగం గంగాధర్, కొండ గంగాధర్, శిర్ప లింగం, నాయకులు కే రాములు, నరసయ్య, ఎల్లయ్య, రవి, మండలాల కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

కేంద్ర సాహిత్య పురస్కార్ అవార్డు గ్రహీతకు సన్మానం



అవార్డు గ్రహీతను అభినందించిన పలువురు

నవతెలంగాణ-బోధన్

కేంద్ర సాహిత్య పురస్కార్ అవార్డును అందుకున్న రచయిత రమేష్‌కార్తీక్‌ను బుధవారం పట్టణంలోని విజయసాయిహై స్కూల్లో ఎంఈఓ నాగనాథ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామంలో జన్మించి గురువులు నేర్పిన విద్య, వినయంతో ముందుకు సాగి చిన్న చిన్న రచనలు చేస్తూ రచయితగా మారి కేంద్ర సాహిత్య పురస్కారం అవార్డును అందుకున్న రమేష్ కార్తీక్ నాయక్ అపర మేధావని కొనియాడారు. విజయ సాయి పాఠశాల పూర్వ విద్యార్థిగా పాఠశాలకు, తల్లిదండ్రులకు, గురువులకు ఉత్తమ పేరు సాధించిపెట్టిన రమేష్ కార్తీక్ నాయక్ అభినందనీయుడని అన్నారు. ఈ సందర్భంగా యువ రచయిత రమేష్ కార్తీక్ నాయక్ మాట్లాడుతూ.. పాఠశాలలోని అధ్యాపక బృందం బోధించిన అంశాలను నేర్చుకుని ఇక్కడి నుండే నేను చిన్న చిన్న రచనలను ప్రారంభించానని తెలిపారు. బొమ్మలు గీసీ వాటిని స్కూల్ డే ఫంక్షన్స్ నాడు ప్రదర్శించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించే వారని అన్నారు. వారి ప్రోత్సాహంతో రచయితగా మారి కేంద్ర సాహిత్య పురస్కారం అవార్డును పొందానన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కృష్ణ మోహన్, మేనేజర్ చక్రవర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని

విజయవంతం చేయండి

- కరపత్రాల ఆవిష్కరించిన ఎంఆర్‌పీఎస్ నాయకులు

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని బాబు జగ్జీవన్ రావ్ చౌరస్తాలో బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకులు బాబు జగ్జీవన్ రావ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. అనంతరం తెలంగాణ ఎంఆర్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న నాయకత్వంలో వచ్చే నెల జులై ఏడున హైదరాబాదులోని రవీంద్రభారతిలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం సందర్భంగా జెండా పండుగ ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు నాయకులు అధిక తరలిరావాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోర్ కమిటీ మందుగల విద్యాసాగర్ ,జిల్లా ఉపాధ్యక్షులు దేగామ్ సాయిలు, బోధన్ డివిజన్ అధ్యక్షులు ఏ .నగేష్ , కోటగిరి మండల అధ్యక్షుడు సాయిలు , కోటగిరి ఉద్యోగ సంఘాల నాయకుడు బుర్రల సాయన్న, కోటగిరి గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సాయిలు మండల ఉపాధ్యక్షుడు ఏ శ్రీనివాస్ , ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు అందరు పాల్గొన్నారు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

ప్రీస్కూలు బోధన ముఖ్యమైన బాధ్యత

- మున్సిపల్ కమిషనర్ రాజు

నవతెలంగాణ-ఆర్మూర్

అంగన్వాడి కేంద్రాల్లో ప్రీ స్కూల్ విద్యా బోధన మీ అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. పట్టణంలోని ప్రాజెక్ట్ పరిధిలోని సిడిపిఓ కార్యాలయంలో బుధవారం అంగన్వాడి టీచర్లకు రిఫ్రెష్ ప్రీస్కూల్ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. అంగన్వాడి టీచర్లందరూ అన్ని శాఖల కార్యక్రమాల్లో కాకుండా నూతన విద్య విధానం యొక్క లక్ష్యాన్ని 2030 వరకు చేరుకోవాలని అన్నారు. అంగన్వాడి అనేది పూర్వ ప్రాథమిక విద్య పునాది దశ అని, దీనిపైన ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ డిఈ భూమేశ్వర్, ఇంచార్జ్ సిడిపిఓ జ్యోతి, మాస్టర్ ట్రైనర్స్ రేఖ, శ్రీదేవి, సూపర్వైజర్లు రామా, మాధవి, అనురాధ కోఆర్డినేటర్ విలాస్ ,ఆరు సెక్టార్ల నుండి 35 మంది అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్

ఉత్తమ పౌర సమాజం కోసం

మత్తు పదార్థాలను నిషేధించండి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఉత్తమ పౌర సమాజం కోసం మత్తు పదార్థాలను నిషేధించండి అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ అన్నారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మత్తు పదార్థాలు మరియు అక్రమ రవాణా నిషేధ దినోత్సవంను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ ఆధ్వర్యంలో స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రం సీతారాం నగర్‌లో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో మత్తు పదార్థాలను నిషేధించి మానవ అక్రమ రవాణాన్ని అరికట్టండి, పాన్ పరాగ్ గుట్కా మానండి.. ఆరోగ్యాన్ని కాపాడండి, సే నోటు డ్రగ్స్ అనే నినాదాలతో అవగాహన ర్యాలీని నిర్వహించారు. అనంతరం పట్టణ ఆరోగ్య కేంద్రంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే చక్కని ఆరోగ్య అలవాట్లు అలవర్చుకొని మత్తుపదార్థాలు డ్రగ్స్ లాంటి విషయాలకు పోకుండా ముఖ్యంగా పాన్ పరాగ్ ,గుట్కా, కళ్ళు, సారాయి, హీరాయిన్, టొబాకో, ధూమపానం, ఆల్కహాలు ఇలాంటివి వాడకుండా ఉండాలన్నారు. మత్తు పదార్థాలను వాడడం వల్ల గుండె జబ్బులు, హార్ట్ ఎటాక్, మధుమేహం, నరాల జబ్బులు, పక్షవాతం, క్యాన్సర్, మానసిక వ్యాధులు లాంటివి సంభవించి జీవితమే నాశనమవుతుందని తద్వారా సామాజికంగా, ఆర్థికంగా వారి కుటుంబం నవ్వుల పాలై అప్పుల పాలు అవ్వడం వల్ల యువత బంగారు భవిష్యత్తును కోల్పోతారని అన్నారు. చిన్న పిల్లలు, మహిళల అక్రమ రవాణా ద్వారా వెట్టిచాకిరి, బానిసత్వం, వ్యభిచారం లాంటి కూపాల్లోకి నెట్టడంతో మహిళల సంఖ్య నానాటికి తగ్గిపోయి వారి బంగారు భవిష్యత్తు ను నాశనం చేస్తున్న ముఠాలపై ప్రభుత్వం వివిధ చట్టాల ద్వారా కఠిన చర్యలు తీసుకొని మత్తు పదార్థాలు లేని, మానవ, మహిళల, చిన్నపిల్లల అక్రమ రవాణా జరగని జిల్లాగా, రాష్ట్రంగా, దేశంగా రూపొందాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో నాల్కల్ రోడ్డు లో గల ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఆనంద నిలయం, ధర్మారం బి లోగల మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశా, కళాశాలలో అవగాహన సదస్సులను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య విద్య బోధకులు ఘన్పూర్ వెంకటేశ్వర్లు, డిపిహెచ్ఎన్ఓ స్వామి సులోచన, హెచ్ ఈ ఓ నాగరాజు మరియు హాస్టల్ వార్డెన్లు రాములు, రేఖ, మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాపయ్య, కళాశాల ప్రిన్సిపాల్ అరుణ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు